క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ–2540) రాష్ట్ర రెండో మహాసభ ఈ నెల 22న హైదరాబాద్‌లో జరగనుందని టీపీఏఎండబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న తెలిపారు. టేకులపల్లిలో సభల పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. లక్షలాదిమంది ఆటో మోటార్ కార్మికులు స్వయం ఉపాధితో జీవిస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదని వాపోయారు. పన్నుల రూపాన ప్రభుత్వానికి రూ.వందల కోట్లు చెల్లిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాక రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లే కారణమని జరిమానా, శిక్షలు విధిస్తుండటం గర్హనీయమని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ఏమీ చేయకపోగా, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ హామీ కూడా అమలుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యాన 22వ తేదీన జరిగే మహాసభలో కార్యాచరణ రూపొందించనున్నందున డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జరుపుల సుందర్, మదార్, జె.రవీందర్, బి.లింగ, బి.రఘు, ఎస్.శ్రీను, ఎ.శంకర్, టి.శ్యామ్, రవితేజ, పి.కృష్ణ, డి.రాజేశ్, సీహెచ్.సునీల్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుజాతనగర్: సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కాసాని లక్ష్మీనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ భారతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడారు. లక్ష్మీనగర్ గ్రామవాసులకు ఇంటి పట్టాలు ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇంటి నంబర్లు కేటాయించకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, బచ్చలకూర శ్రీనివాస్, భూక్యా శంకర్, బానోత్ వీరు, మురిపిటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిషేధించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మత్తు పదార్థాలు, బెల్టు షాపులను నిషేధించాలని కోరుతూ ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఏఓ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, కేజీబీవీఎస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్, జిల్లా నాయకులు లక్ష్మణ్, రావూరి ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

టేకులపల్లి: మండలంలోని పోడు రైతులకు న్యాయం చేయాలని డీసీసీబీ డైరెక్టర్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ఐటీడీఏ అధికారులను కోరారు. సోమవారం టేకులపల్లి మండలంలోని పెట్రాంచెలక, ఎర్రాయిగూడెం స్టేజీ, రామచంద్రునిపేట గ్రామాలకు చెందిన పోడు రైతులతో కలిసి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఏళ్లుగా పోడు భూముల్లో ఆదివాసీ, గిరిజన రైతులు వర్షాధారంగానే వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. పోడు భూముల్లో విద్యుత్ సదుపాయంతో పాటు బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు టీవీ వితరణ

జూలూరుపాడు: కరివారిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సోమవారం అదే గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వడ్డే మణిందర్ రూ.30,000 విలువ గల ఎల్‌ఈడీ టీవీని వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్, వడ్డే అచ్చయ్య, వడ్డే సత్యం, వెంకటనారాయణ, అంగోత్ జానకీరామ్, ధరావత్ లక్ష్మీనారాయణ, బోడా బాబూలాల్, వడ్డే నరసింహారావు, గుగులోత్ రాంబాబు పాల్గొన్నారు.

శివారు.. పట్టించుకోరు..

స్లమ్ ఏరియాలపై ఏడాదిగా దృష్టి పెట్టని అధికారులు

- పాల్వంచ మున్సిపాలిటీలో మందగించిన పారిశుద్ధ్య పనులు
- కేవలం ప్రధాన వీధుల్లోనే చెత్తాచెదారం తొలగింపు
- కాలనీల్లో పర్యటించని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు



దివ్యాంగుల కాలనీలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగునీరు

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు మందగించాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాలపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 9 నెలలుగా అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. చెత్త తరలింపు, సేకరణకు నాలుగు ట్రాక్టర్లు, 30 ఆటోలు ఉండగా కనీసం వారానికి ఒకటి రెండు సార్లు కూడా తమ ప్రాంతాలకు రావడం లేదని చెబుతున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులు ఉండగా 44 స్లమ్ ఏరియా (మురికి వాడ)లు ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, డ్రెయినేజీల్లో మురుగు ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతున్నాయి. తాగునీటి పైపులైన్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

కాలనీల్లో పర్యటించని అధికారులు

కాగా స్లమ్ ఏరియాల సమస్యలను గుర్తించేందుకు అధికారులు గతంలో అడపాదడపా పర్యటించేవారు. కానీ ఇటీవల కాలంలో కంటి తుడుపు పర్యటనలు తప్ప ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు కాలనీల్లో పర్యటించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కాలనీల్లో పర్యటిస్తే ప్రజలు పడుతున్న బాధలు అధికారులకు కనపించేవని, వెంటనే పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. కానీ ఆ దిశగా సమయం వెచ్చించక పోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు నిత్యం మున్సిపాలిటీలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి అప్పటికప్పుడు పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

సరిచేయని తాగునీటి పైపులైన్లు

తాగునీటి పైపులైన్ల పరిస్థితి అధ్వానంగా మారింది. స్లమ్ ఏరియాల్లో అనేక చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. మురుగు కాల్వల్లో నుంచి లైన్లు ఉండటంతో తాగునీరు మలినం అవుతోందని పేర్కొంటున్నారు. దీంతో అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. తాగునీటి పైపులైన్లను సరిచేయాలని అనేకసార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలల తరబడి పట్టింపు లేదు..

కొన్ని కాలనీల్లో సుమారు ఏడాదికాలంగా అధికారులు పర్యటించిన దాఖలాలు లేవని స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలే పాలక వర్గం లేక పోవడంతో స్థానికులు వారి సమస్యలను మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకుని వెళ్లడం తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో వనమాకాలనీ, వికలాంగులకాలనీ, ఇందిరాకాలనీ, జయమ్మకాలనీ, సీతారాంపట్నం, నవభారత్, శేఖరం బంజర, ప్రశాంత్ నగర్ కాలనీ, రాంనగర్, శివనగర్, గొల్లగూడెం తదితర ఏరియాల్లో డ్రెయినేజీలు మురికినీటితో నిండిపోయాయి. సిల్ట్ తీసేందుకు సిబ్బంది రాక పోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోడ్ల వెంట చెత్తాచెదారంతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. దివ్యాంగుల కాలనీలో రోడ్డుపై ఎనిమిది నెలల కిందట డ్రెయిన్‌లో చెత్త తీసి రోడ్డుపై పడేశారు. అనంతరం వాటిని ఎత్తకుండా వదిలేయడం గమనార్హం. గత వర్షాకాలంలో కొన్నిచోట్ల కాంక్రీట్ డ్రెయినేజీలు కూలిపోయాయి. నాణ్యత లేకుండా నిర్మించడంతో కూలిపోతున్నాయని మండిపడుతున్నారు.



కూలిపోయిన కాంక్రీట్ డ్రెయినేజీ

డ్రెయినేజీ తీయక ఏడాది..



మురుగు కాల్వలు మొత్తం ఎక్కడికక్కడ నిండిపోయాయి. మట్టితో పూడుకుపోయాయి. చెట్లు పెరిగి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. ఏడాదిగా కనీసం అధికారులు పర్యటించి చూసిన దాఖలాలు లేవు. డ్రెయినేజీలు తీయక పోవడంతో మురుగు నిండి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. పారిశుద్ధ్య పనులు క్రమం తప్పక చేయాలి.

–మధు, దివ్యాంగులకాలనీ

తాగునీటి పైపులకు లీకేజీలు



కాలనీలో తాగునీటి పంపుల లీకేజీలు చాలా చోట్ల ఏర్పడ్డాయి. దీంతో తాగునీరు వృథా అవుతోంది. పెద్ద డ్రెయినేజీల గుండా పైపులు ఉండటంతో పంపుల్లోకి మలినాలు చేరుతున్నాయి. వాటిని తాగడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నాం. కాలనీలో గత వర్షాకాలంలో మెయిన్ డ్రెయినేజీ చాలాచోట్ల కూలిపోయింది. స్వచ్ఛ ఆటోలు రావడం లేదు.

–వెంకటమ్మ, దివ్యాంగులకాలనీ

సమస్యలు పరిష్కరిస్తాం



స్లమ్ ఏరియాల్లో కొన్ని నెలలుగా పారిశుద్ధ్య పనులు చేపట్టలేదని మా దృష్టికి వచ్చింది. దీంతో ఎర్రగుంట, నవభారత్ ఏరియాల్లో సమస్యలు పరిష్కరించాం. త్వరలోనే బంగారుజాల, కొత్తూరు, వికలాంగుల కాలనీ సమీపాల్లో ఉన్న కాలనీల్లో సైతం చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛ సిబ్బంది రాకపోతే మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పంపిస్తాం.

–కె.సుజాత, మున్సిపల్ కమిషనర్

ముగిసిన గ్రూప్ - 2 పరీక్షలు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

సుజాతనగర్: మండలంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల, ధన్వంతరి ఫార్మసీ కళాశాలలో సోమవారం గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలోని రెండు సెంటర్లలో 1,183 మందికి గాను ఉదయం 546 మంది, మధ్యాహ్నం 583 మంది హాజరయ్యారు. ధన్వంతరి ఫార్మసీ కళాశాలలో 264 మందికి గాను ఉదయం 123 మంది, మధ్యాహ్నం 123 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ తీరుపై నేడు నిరసనలు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై అక్రమ కేసులు, రైతు చేతులకు బేడీలు వేయడం తదితర అంశాలపై మంగళవారం నిరసనలు తెలుపనున్నట్లు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేసి వారిని విడుదల చేయాలనే డిమాండ్‌తో అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆమె ఓ ప్రకటనలో సూచించారు. అలాగే, బీఆర్‌ఎస్ శ్రేణులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించాలని కోరారు.

ఆలయంలో అన్నదానం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి ఏ–పవర్‌హౌస్‌బస్తీలోని శ్రీ సత్యసాయి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు సోమవారం అన్నదానం నిర్వహించారు. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయ సూపర్‌వైజర్ శివరాంజీ దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా.. బీఎస్‌ఎన్‌ఎల్ ఎస్‌డీఓ సక్రు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ ఆస్పత్రిలో వెల్ బేబీ షో

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో సింగరేణి డేను పురస్కరించుకొని సోమవారం సింగరేణి కార్మికుల పిల్లలు ఐదేళ్లలోపు ఉన్న వారికి వెల్‌బేబీషోను నిర్వహించారు. ముఖ్య అతిథిగా సింగరేణి ప్రధానాస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాత హాజరయ్యారు. గెలుపొందిన చిన్నారులకు ఈ నెల 23న సింగరేణిడే వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. ఏసీఎంఓ ఎం.ఉషా, డీవైసీఎంఓ సునీల, డాక్టర్ క్యూబా, తస్నీమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, సింగరేణి దినోత్సవంలో సేవా సమితి మహిళలు పాల్గొనాలని డి.హరిణి, జి.సునీత పిలుపునిచ్చారు. సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈ నెల 23న జరిగే సింగరేణి డే వేడుకల్లో సింగరేణి సేవా సమితి మహిళలు అధికంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో కోడూరి శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, టి.శ్రీనివాసరావు, వరప్రసాద్‌రావు, షరీఫ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు

ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో సోమవారం రుద్రంపూర్, గౌతంపూర్, సింగరేణి సేవా సమితి మహిళలకు బెస్ట్ ఎన్విరాల్‌మెంట్ హౌస్, దీపాలంకరణ, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి హాజరయ్యారు. రుద్రంపూర్, గౌతంపూర్, త్రీఇంక్‌లైన్‌లోని బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ హౌస్ కోసం రిజిస్టర్ చేయించుకున్న ఇళ్లను కమిటీ సభ్యులు డీజీఎం (ఐఈడీ) ఎస్.మోహన్, సీనియర్ పీఓ మురళి, సివిల్ ఇంజనీర్ రాజారాం సందర్శించారు. విజేతలకు ఈ నెల 23న ప్రగతివనంలో జరిగే సింగరేణిడే వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పద్మజారాణి, సుమలత, హేమలత, మోహన్, మురళి, సంఘమిత్ర, రాజారాం, అనిత పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



పాల్వంచ: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: సర్వే చేస్తున్న సిబ్బంది

పాల్వంచ: మున్సిపాలిటీలోని అన్ని ఏరియాల్లో సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మేనేజర్ ఎల్వీ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గౌని నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో సర్వేలు నిర్వహించి ఇప్పుడు రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మంకెన వెంకటేశ్వర్లు, నరసింహారావు, వై.శ్రీను, సీహెచ్.వెంకటేశ్వర్లు, రాజేశ్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకే ఇవ్వాలి..

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డితో మంగీలాల్‌నాయక్ మాట్లాడారు. నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, గోపు రామకృష్ణ, బానోత్ వెంకట్రామ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇంటింటి సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఈ నెల పదో తేదీన సర్వే ప్రారంభం కాగా పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో లబ్ధిదారులు చెప్పిన వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి పలు గ్రామాల్లో సర్వేను స్వయంగా పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

కొత్తగూడెంఅర్బన్: విద్యాదానం ఎంతో గొప్పదని జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్, రామవరం శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. కొత్తగూడెంలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు జమాతే ఇస్లామి హింద్ తరఫున నెల రోజులకు సరిపడా అల్పాహారం సోమవారం అందచేశారు. చదువే సమాజం అభివృద్ధికి మూలం అని, అలాంటి చదువుకు పేదరికం అడ్డు కావొద్దని, సమయాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఊరికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో రబ్బానీ, రవీందర్, రామారావు, హరిబాబు, లాలు, స్పందన తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం అందజేస్తున్న జేఐహెచ్ సభ్యులు

ఫ్లోర్ లీడర్‌గా జమలయ్య



జమలయ్య

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం 8వ వార్డు కౌన్సిలర్ సీపీఐ ఫ్లోర్ లీడర్‌గా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అందించారు. ఆ నియామకపత్రాన్ని సోమవారం కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ధర్మరాజు, చారి, బోయిన విజయ్, యూసుబ్, భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకన్న, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

సుజాతనగర్: సుజాతనగర్‌కు చెందిన మడిపల్లి గోవిందు, లక్ష్మీల జ్ఞాపకార్థం వారి కుమారుడు మడిపల్లి శ్రీనివాస్ బియ్యం, నిత్యావసర వస్తువులను షేక్ పుల్లుసాహెబ్, రామిశెట్టి నరసింహారావుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి రాజశేఖర్, పైడా రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: నిరుద్యోగ పేద మైనారిటీ మహిళల కోసం ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్లు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగి, ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డుతో పాటు కనీస విద్యార్హత 5వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. తెల్ల రేషన్, ఆహార భద్రత కార్డు లేని వారు గ్రామీణ ప్రాంతాల్లో వారైతే రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఆదాయ ధ్రువీకరణ పత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పొంది ఉండాలని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం క్యాంపు సెంటర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఉపసర్పంచ్ మండ దుర్గారావు తీవ్రంగా గాయపడ్డాడు. ఇల్లెందు నుంచి ధనియాలపాడుకు ఉపాధ్యాయుడు అరెం లక్ష్మీనారాయణ బైక్‌పై వెళ్తూ.. ఎదురుగా వచ్చిన దుర్గారావు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గారావును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీను మృతి తీరని లోటు

జూలూరుపాడు: మాచినేనిపేటతండాకు చెందిన సీపీఎం నాయకుడు లకావత్ శ్రీను మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. సోమవారం శ్రీను సంస్మరణ సభ నిర్వహించగా.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం, అన్నవరపు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, యాసా నరేశ్, గార్లపాటి వెంకటి, బానోత్ మధు, వల్లమల్ల చందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, లచ్చునాయక్, లకావత్ చందర్ ఉన్నారు.

‘మధ్యాహ్న’ కార్మికుల ధర్నా షురూ

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం అమలుపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాచౌక్‌లో సీఐటీయూ అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో 48 గంటల ధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి దీక్షలను ప్రారంభించి ప్రసంగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ముఖ్యమంత్రి, మంత్రులు విజయోత్సవాలు ఎలా జరుపుకుంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. రూ.10 వేల వేతనాన్ని తక్షణం అమలు చేయాలని, ప్రతి కార్మికురాలికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కాగా, ధర్నాలో ప్రతి కార్మికురాలు కొంత బియ్యం, కందిపప్పు, మంచినూనె ఇతర నిత్యావసర వస్తువులు తీసుకొచ్చి వంటావార్పు నిర్వహించారు. ధర్నాలో ఏజే రమేశ్, జి.పద్మ, సుల్తానా, పిట్టల అర్జున్, దొడ్డ రవికుమార్, కె.సత్య, భూక్యా రమేశ్, ఎస్.సాంబశివరావు, రామలక్ష్మి, వెంకటనర్సమ్మ, సమ్మక్క, నిరోష, తిరుపతమ్మ, శివమ్మ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కాంట్రాక్ట్ కార్మికులపై వివక్ష తగదు



మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పట్ల వివక్ష తగదని, కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచకుంటే ఈ నెల 23న సింగరేణి డే రోజున బ్లాడ్‌డేగా నిరసనలు చేపడుతామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు దూలం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కాంట్రాక్ట్ కార్మికుల అడ్డాల్లో అయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోగా, కోల్ ఇండియా వేతనాలు ఇస్తామని హామీలు ఇచ్చి అమలు చేయకపోవటం దారుణమన్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తూ సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో చర్చించాలి

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌షావలీ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రైటర్‌బస్తీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు అసెంబ్లీలో లేవనెత్తాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో పెద్దబోయిన సతీశ్, కృష్ణ, నాగలక్ష్మి, కరుణ, సంధ్య, పద్మ, రాజేశ్వరి, సుల్తాన్, బి.హుస్సేన్, పోశం, పూర్ణ, శాంత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లదే కీలక బాధ్యత..

ఇల్లెందు: ఈ నెల 20, 21 తేదీల్లో ఇల్లెందు పట్టణంలో జరిగే సీపీఎం జిల్లా మహాసభల్లో వలంటీర్లు కీలక బాధ్యత పోషించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఏజే రమేశ్ తెలిపారు. సోమవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తలు, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వంతో పాటు ప్రతినిధులు హాజరవుతారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏజే రమేశ్

బాధ్యతలు స్వీకరించిన సేవా అధ్యక్షురాలు

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఇల్లెందు ఏరియా అధ్యక్షురాలిగా వీసం రమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమెను సేవా సమితి సభ్యులు, ట్రెయినర్లు సత్కరించారు. అనంతరం రమ మాట్లాడుతూ.. జేకేఓసీ ప్రభావిత గ్రామాల మహిళలకు ఉపాధి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, 17న నిర్వహించాల్సిన వెల్‌బేబీ షోను 18వ తేదీకి వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సేవా సమితి సమన్వయ అధికారి కె.సాయిస్వరూప్, కోఆర్డినేటర్ కోటా సాంబయ్య పాల్గొన్నారు.



సేవా సమితి సభ్యులు, ట్రెయినర్లతో వీసం రమ